క్లుప్తంగా

నేడు మండల్ మీట్

పెద్దతిప్పసముద్రం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల్ మీట్ నిర్వహిస్తామని ఎంపీపీ మహమూద్ తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని, మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో సమావేశానికి రావాలని ఎంపీపీ సూచించారు.

పెద్దిరెడ్డిని కలిసిన నిసార్ అహ్మద్


మాజీమంత్రి పెద్దిరెడ్డితో నిసార్ అహ్మద్

మదనపల్లి: వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్ మంగళవారం మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిశారు. తిరుపతి గృహంలో కలిసిన నియోజకవర్గ పార్టీ పరిస్థితులను పెద్దిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీ మిథున్‌రెడ్డిని మద్యం అక్రమ కేసులో అరెస్ట్ చేయడంపై విచారం వ్యక్తం చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం


విత్తనాలు అందజేస్తున్న ఎంపీడీఓ థామస్

తంబళ్లపల్లె: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలతో ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఫోర్డు సంస్థ డైరెక్టర్ జిల్లా లలితమ్మ అన్నారు. మంగళవారం గుండ్లపల్లె పంచాయతీలోని పాపిరెడ్డిపల్లెలో అజీమ్‌ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. రైతులకు కందులు, అలసందలు, అనుములు, కిచెన్‌గార్డన్ విత్తనాలు బెండ, కాకర, ముల్లంగి, మొట్టికాయ, పాలఆకు, తోట ఆకు, మెంతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ థామస్, సెక్రటరీ, ఫోర్డు సిబ్బంది నరసింహులు, రమణ, సుభాషిణి, సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రకు సంఘీభావం


పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు

మదనపల్లె సిటీ: మిలటరీ బెటాలియన్‌కు యాదవుల పేరు పెట్టాలని డిమాండ్ చేస్తూ శాంతయుతంగా చేస్తున్న పాదయాత్రకు మంగళవారం యాదవ సంఘ నాయకులు సంఘీభావం ప్రకటించారు. కాశీ నుంచి కన్యాకుమారి మీదుగా ఢిల్లీకి పాదయాత్ర చేస్తున్న యాదవులకు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక గోవర్ధనగిరిలోని శ్రీకృష్ణాలయాన్ని సందర్శించారు. యాత్ర విజయవంతం కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్, యాదవ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ప్లీనరీని జయప్రదం చేయండి

మదనపల్లె సిటీ: ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరసింహ కోరారు. మంగళవారం ప్లీనరీకి సంబంధించిన మదనపల్లెలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ ఆగస్టు 4,5 తేదీల్లో రాజంపేటలో ప్లీనరీ సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యా సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్నామని పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆఫ్రిద్, జిల్లా కమిటీ సభ్యులు జయబాబు, అరుణ్‌తేజ, శివకుమార్, కార్తీక్, వేణు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ భూముల సర్వేకు సమాయత్తం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కాట్నగల్లు పంచాయతిలో అగ్రిగోల్డ్ భూముల సర్వేకు రెవెన్యూ అధికారులు సమాయత్తమయ్యారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అగ్రిగోల్డ్ భూములు ఎన్ని ఎకరాలు, ఎన్ని సర్వే నంబర్లలో ఉన్నాయి. సదరు భూములు అన్యాక్రాంతం అయ్యాయా, అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసుకున్నారా అనే అంశాలపై సమగ్రంగా తనిఖీ చేపట్టేందుకు అధికారులు సర్వే బృందాలను విభజించారు. కాట్నగల్లులో 60 సర్వే నంబర్లలో 126 ఎకరాల భూములు ఉన్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. బుధవారం నుంచి ఈ భూముల సర్వే కార్యక్రమం జరగనున్నట్లు సమాచారం.

'ఆడుదాం ఆంధ్రా' నిధుల వివరాలు తెలపండి

మదనపల్లె రూరల్ : ఆడుదాం ఆంధ్రా క్రీడా కార్యక్రమానికి సంబంధించి మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో కేటాయించిన నిధులు, కొనుగోలు చేసిన క్రీడా సామగ్రి, వ్యయం చేసిన మొత్తంపై సమగ్ర వివరాలు తెలపాల్సిందిగా విజిలెన్స్ అధికారులు, సబ్ కలెక్టర్ కార్యాలయం డీఏఓ నిర్మలాదేవికి లేఖ సమర్పించారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో కడప విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీసీటీఓ గీతావాణి, సీఐ ఎం.శివన్న, డీఏఓ నిర్మలాదేవిని కలిసి వివరాలు కోరారు.

ప్రణాళిక లోపం.. ట్రాఫిక్ అస్తవ్యస్తం

- రోడ్డుపైనే వాహనాలు నిలుపుదల
- స్తంభిస్తున్న ట్రాఫిక్‌తో ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు


ఎన్టీఆర్ సర్కిల్ వద్ద రోడ్లపైనే పార్కింగ్ చేసిన వాహనాలు

మదనపల్లె సిటీ: పట్టణంలో ట్రాఫిక్ సమస్య నానాటికీ పెరిగిపోతున్నది. పలు వ్యాపార సంస్థలు మెయిన్‌రోడ్డుని ఆక్రమించి షెడ్లు ఏర్పాటు చేయడం, చిరు వ్యాపారులు రోడ్డుపక్కన తోపుడు బండ్లు పెడుతుండడంతో రహదారి కుంచించుకుపోతున్నది. దీనికితోడు వాణిజ్య సముదాయాల్లో పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో రోడ్డుపైనే వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. మరోవైపు నానాటికీ వాహనాలు పెరిగిపోతున్నాయి. ప్రైవేటు కంపెనీలు, విద్యా సంస్థల బస్సులు, ఆటోలను రోడ్డు పక్కన ఎక్కడపడితే అక్కడ నిలుపుదల చేస్తున్నారు. ఇక చిరువ్యాపారుల తోపుడు బళ్ల గురించి చెప్పాల్సిన అవసరం లేదు. పాదచారులు రోడ్డుపై నడవాల్సి వస్తున్నది. ఉదయం ఎనిమిది గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం ఐదు గంటల నుంచి పది గంటల వరకు పట్టణంలో వాహనాల రద్దీ విపరీతంగా ఉంటుంది. అధికారుల ప్రణాళిక లేకపోవడంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారుతోంది. దీంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రధాన కూడళ్లల్లో దయనీయం

పట్టణంలోని ప్రధాన కూడళ్లల్లో కనీసం పార్కింగ్ స్థలాలు లేవు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఓ కార్పొరేట్ చికెన్ సెంటర్ ఏర్పాటు చేశారు. దీంతో సాయంత్రమైతే చాలు వాహనాలు రోడ్లుపైనే పార్కింగ్ చేస్తున్నారు. వాహనాలు రాకపోకలు స్తంభించిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బెంగళూరు బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన షాపుల ఎదుట వందలాది వాహనాలు రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రాకపోకలు ఇబ్బందిగా మారింది. దీనికితోడు ఇటీవల మురికినీటి కాలువ నిర్మాణం చేపట్టడంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలమైంది. టౌన్‌బ్యాంకు సర్కిల్ వద్ద షాపింగ్‌మాల్ వద్ద వాహనాలు రోడ్లపై నిలపడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అంబేడ్కర్ సర్కిల్, గొల్లపల్లి సర్కిల్, ఎస్టేట్, వారపుసంత, నీరుగట్టువారిపల్లె మార్కెట్‌యార్డు, నిమ్మనపల్లె సర్కిల్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. భారీ వాహనాలు కూడా పట్టణంలో నుంచే బెంగళూరు వైపు వెళుతున్నాయి. బెంగళూరు నుంచి వచ్చే వాహనాలు కూడా పట్టణంలో నుంచే వెళ్తున్నాయి. దీనికి తోడు సాయంత్రం 7 గంటల నుంచి హైదరాబాదు, విజయవాడ ప్రైవేటు బస్సులు ఎక్కడపడితే అక్కడ ప్రధాన రహదారుల్లో నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి



పట్టణం రోజు రోజుకు విస్తరిస్తుంది. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. దీనిపై పోలీసు, మున్సిపల్, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందజేశాం. ప్రధాన కూడళ్లల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి.

–తిరుపతిరావు, టౌన్‌అఫెక్స్ అధ్యక్షుడు, మదనపల్లె

రికార్డులను సక్రమంగా నిర్వహించాలి


నర్సరీలో తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎస్ఎస్‌వీ సుభాషిణి

మదనపల్లె రూరల్ : నర్సరీ యజమానులు ఉద్యానశాఖ నుంచి అనుమతులు పొంది పక్కాగా రికార్డులు నిర్వహించాల్సి ఉంటుందని జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎస్ఎస్‌వీ సుభాషిణి తెలిపారు. మంగళవారం మదనపల్లె మండలంలోని వివిధ కూరగాయల నర్సరీలను, మండల హార్టికల్చర్ ఆఫీసర్ ఈశ్వర్ ప్రసాద్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. విత్తనాలు ఎక్కడి నుంచి తెస్తున్నారనే విషయమై ఆరా తీశారు. అనుమతి లేని కొత్త వెరైటీలను నర్సరీలో వేయరాదని సూచించారు. ముఖ్యంగా జీ–15 బొప్పాయి రకాన్ని వేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నర్సరీ స్థాపించిన ఆరు నెలల్లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, అలాగే నర్సరీ లైసెన్స్‌లు మూడేళ్ల కాలపరిమితి అయిపోయిన వారు తిరిగి రెన్యువల్ చేయించుకోవాలన్నారు. ప్రతి నర్సరీలో యజమాని.. విత్తన కొనుగోలు రిజిస్టర్, సస్యరక్షణ చర్యల రిజిస్టర్ తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ముఖ్యంగా ప్రతి రైతుకు తప్పనిసరిగా మొక్కలు కొనుగోలు బిల్లు ఇవ్వాలని ఆదేశించారు. నర్సరీ యజమానులు లైసెన్స్ రెన్యూవల్ కోసం 1బీ లేదా లీజు అగ్రిమెంట్, ఆధార్, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, గతంలో జారీచేసిన లైసెన్స్ కాపీతో పాటు రూ.1,000 చలానా చెల్లించి హార్టికల్చర్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లె వ్యవసాయ సహాయకుడు పృథ్వీ, నర్సరీ యజమానులు పాల్గొన్నారు.

మహిళా సమస్యలపై సత్వరమే స్పందించండి


మహిళలతో మాట్లాడుతున్న డీఎస్పీ మహేంద్ర

మదనపల్లె రూరల్ : గ్రామ, వార్డు మహిళా పోలీసులు క్షేత్రస్థాయిలోని మహిళలు, పిల్లలు, విద్యార్థుల సమస్యలపై సత్వరమే స్పందించాలని డీఎస్పీ మహేంద్ర అన్నారు. మంగళవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలోని సమస్యలు గుర్తించాల్సిన బాధ్యత జీఎంఎస్‌కేలపై ఉందన్నారు. స్థానికంగా పర్యటించి సమస్యలతో పాటు అసాంఘిక కార్యకలాపాల సమాచారాన్ని సేకరించి ఎప్పటికప్పుడు సంబంధిత పోలీస్ స్టేషన్‌లకు తెలపాలన్నారు. సైబర్ నేరాలపై పాఠశాలలు, కళాశాలలతో పాటు స్థానికంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బాధితులకు పోలీస్‌స్టేషన్‌లలో సత్వర సహాయం అందేలా సహకరించాలని ఆదేశించారు. మహిళా రక్షణకు సంబంధించి పలు అంశాలపై సలహాలు, సూచనలు అందించారు.

మానవతా సంస్థ సేవలు అభినందనీయం


బల్లలు వితరణ చేసిన మానవా సేవా సంస్థ సభ్యులు

పీలేరు : మానవతా సంస్థ సేవలు అభినందనీయమని ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ చంద్రోశేఖర్ కొనియాడారు. సిట్టింగ్ ప్లాంక్స్ (కూర్చునే బల్లలు) వితరణ చేసినట్లు మానవత సంస్థ చైర్మన్ వి. రామచంద్ర అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో బల్లలు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు, వారి సహాయకులకు వీలుగా ఉండేందుకు బల్లలు ఇచ్చినట్లు తెలిపారు. అలాగే యల్లమ్మ ఆలయం, హరేకృష్ణ మందిరం, వినాయకుడి గుడి, రౌద్రాల అంకాలమ్మ గుడి, వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు రూ. 40 వేలు విలువైన బల్లలు అందజేసినట్లు తెలిపారు. సంస్థ అధ్యక్షుడు శెట్టి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి బి.వి. సురేష్, కోశాధికారి జగన్‌మోహన్, కో చైర్మన్ ఆర్. కృష్ణమూర్తి, కన్వీనర్ వై.వి. రమణ, సభ్యులు రమేష్, సుధాకర్‌బాబు, అక్రంబాషా, గఫార్‌సాహెబ్ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి

తంబళ్లపల్లె: మండలంలోని మర్రిమాకులపల్లెలో జరుగుతున్న గ్రామీణ ఉపాధి హామీ పనులలో అవకతవకలు జరుగుతున్నాయని ఫీల్డ్ అసిస్టెంట్ చేతివాటంతో కూలీల నుంచి డబ్బు ఇచ్చివారికే బిల్లులు పెడుతున్నాయని కొండామర్రి నాగరాజు నాయుడు ఆరోపించారు. మంగళవారం ఉపాధి హామీ కార్యాలయంలో ఏపీఓ దృష్టికి తీసుకెళ్లారు. జాబ్‌కార్డు ఉంటే చాలు ఫీల్డ్ అసిస్టెంట్‌కు రూ.150 ఇస్తే వారి పేర్లు మస్టర్లలో నమోదు చేసి అకౌంట్‌లో డబ్బులు పడేటట్లు చేస్తున్నారన్నారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై ఏపీఓ అంజనప్పను వివరణ కోరగా ఇప్పటి వరకు ఎలాంటి అవకతకలు ఫిర్యాదులు రాలేదన్నారు. ఇప్పుడైనా లిఖితపూర్వకంగా ఫిర్యాదు వస్తే విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

వైభవంగా ఆడికృత్తిక మహోత్సవం

రామసముద్రం: రామసముద్రం మండల కేంద్రంలోని దిగవ పేటలోని చంద్రశేఖరస్వామి ఆలయంలో వెలిసిన వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి ఆడికృత్తిక మహోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ప్రధాన అర్చకులు బాలసుబ్రహ్మణ్యం స్వామివారికి ప్రత్యేక పూజలు, వస్త్రాలంకరణ, విశేషాలంకరణ నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తుల తరలివచ్చి స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు చెల్లించారు.


వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి మూల విరాట్

రోడ్డుకు అడ్డుగా కంకర, ఇసుక

వాహనదారులకు ఇబ్బందులు


అగ్రహారం-బండమీద హరిజనవాడ మార్గంలో రోడ్డుపై తోలిన ఇసుక

నిమ్మనపల్లె : కాంట్రాక్టర్ సకాలంలో పనులు చేయకపోవడంతో రోడ్డుకు అడ్డుగా వేసిన కంకర, ఇసుకతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్న పరిస్థితి అగ్రహారం గ్రామంలో నెలకుంది. అగ్రహారం నుంచి బండమీద హరిజనవాడకు వెళ్లే మార్గంలో మురుగుకాలువ నిర్మాణం కోసం కాంట్రాక్టర్ ఇసుక, కంకర రోడ్డుకు అడ్డుగా తోలించారు. అయితే, పనులు చేయడంలో జాప్యం చేయడంతో ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు ముఖ్యంగా రాత్రివేళ ప్రమాదాలకు గురవుతూ గాయపడుతున్నారు. అధికారులు స్పందించి సత్వరమే పనులు పూర్తిచేయించి, సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

తాగునీటికి కటకట


పొలాల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న ప్రజలు

పెద్దతిప్పసముద్రం: 'మా గొంతు తడిపి పుణ్యం కట్టుకోండి సారూ' అంటూ మండలంలోని రాపూరివాండ్లపల్లి పంచాయతీలోని కొత్తపల్లి వాసులు వేడుకుంటున్నారు. తమ గ్రామంలో ప్రభుత్వ తాగునీటి బోరు ఉన్నా మోటారు కాలిపోవడంతో నీటి ఎద్దడి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని 20 రోజుల నుంచి ప్రజలు సచివాలయాల వద్దకు వెళ్లి అధికారుల ఎదుట తమ గోడు వెళ్లబోసుకుంటున్నా పట్టించుకునే నాథులే లేరని గ్రామస్తులు వాపోయారు. వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి పొలం నీళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు బోరు మోటారుకు మరమ్మతులు చేసి నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు


అంకిశెట్టిపల్లె పంచాయతీలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

మదనపల్లె రూరల్ : మండలంలోని అంకిశెట్టిపల్లె పంచాయతీలోని ప్రభుత్వ గయాళు భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేసినట్లు తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం అంకిశెట్టిపల్లె పంచాయతీ సర్వేనెంబర్ 15లోని 74.75 ఎకరాల ప్రభుత్వ గయాళు భూమిలో వీఆర్వో నారాయణ, పోలీసులతో కలిసి హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చట్టప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

అందరికీ ఆమోదయోగ్యంగా భూపరిహారం

జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

మదనపల్లె రూరల్ : మండలంలోని తట్టివారిపల్లె సర్కిల్‌లో జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఫ్లై ఓవర్, సర్వీస్‌రోడ్డుకు భూములు కోల్పోతున్న నిర్వాసితులు, రైతులకు ఆమోదయోగ్యమైన పరిహారం అందిస్తామని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అన్నారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో తట్టివారిపల్లెకు చెందిన రైతులు, గ్రామస్తులతో పరిహారం విషయమై సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్‌మాట్లాడుతూ భూసేకరణకు సంబంధించి రెవెన్యూ అధికారులు ఆలస్యం చేస్తున్నారని, నేషనల్ హైవేస్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఫ్లై ఓవర్ నిర్మాణానికి రెవెన్యూ అధికారులు ప్రతిపాదించిన 3 ఎకరాల 2 సెంట్ల స్థలంలో సుమారు 28 మందికి పైగా రైతులు ఉన్నారన్నారు. జాతీయరహదారి నిర్మాణం, అభివృద్ధి పనులకు స్థానికులు, రైతులు సహకరించాలని కోరారు. ప్రభుత్వం అందరికీ ఆమోదయోగ్యమైన పరిహారం ప్రకటించిందని, రైతులకు ఏవేని అభ్యంతరాలుంటే తెలిపితే వాటిని పరిగణనలోకి తీసుకుంటామన్నారు. సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, నేషనల్ హైవేస్ డిప్యూటీ మేనేజర్ భానుప్రతాప్‌సింగ్, సర్వే ఏడీ భరత్‌కుమార్ పాల్గొన్నారు.

కాశీంఖాన్ మృతి తీరని లోటు


కాశీంఖాన్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల తదితరులు

కలకడ: మండలంలోని కలకడ మేజర్ పంచాయతీ సర్పంచ్ ఫ్యారీజాన్ భర్త, వైఎస్సార్‌సీపీ రాజంపేట పార్లమెంటరీ కార్యదర్శి షౌవత్ అల్లిఖాన్ తండ్రి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తరిగొండ కాశీంఖాన్ (90) మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం కలకడలో ఆయన స్వగృహంలో అనారోగ్యంతో కాశీంఖాన్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చింతల కలకడ వెళ్లి కాసీంఖాన్ మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కాశీంఖాన్‌కు నివాళి అర్పించిన వారిలో కోన సర్పంచ్ జిల్లా రాజగోపాల్‌రెడ్డి, కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పీలేరు నియోజకవర్గ నాయకులు శ్రీనివాసులురెడ్డి, కె.ఎస్. మస్తాన్, జీవీకిషోర్, మోహన్‌రాజ నాయుడు, ఎంపీటీసీ సభ్యులు ముబారక్, సద్దాం, ఉపసర్పంచ్ అక్రం, నాయకులు జిలానీ, కరీముల్లా, రెడ్డెప్పనాయుడు, బయన్న, కుమార్‌రెడ్డి, నరసింహులు, చిన్ననాయుడు, వేణుగోపాల్, మాజీ సర్పంచ్ షబ్బీర్ అహ్మద్, సైసాబ్‌వలి, హసన్‌షా ఉన్నారు.

జిప్సం వాడకంతో అధిక దిగుబడులు


సామకోటవారిపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

నిమ్మనపల్లె : వేరుశనగ పంటలో జిప్సం వాడకంతో అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయాధికారి మంజుల అన్నారు. మంగళవారం మండలంలోని అగ్రహారం, సామకోటవారిపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన చేశారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం నీటి ఆధారంగా వేసిన వేరుశనగ పంట పూతదశలో ఉందని, ఈ దశలో జిప్సం వాడకం పంటకు ఎంతో మేలు చేస్తుందన్నారు. జిప్సం వాడకంతో గింజలు బాగా గట్టిపడి నాణ్యతతో దిగుబడి లభిస్తుందని పేర్కొన్నారు. వేరుశనగ పంటలో అంతరపంటగా కంది పంట వేసుకోవాలని సూచించారు. ప్రతి 7 సాళ్లకు ఒక సాలు కంది వేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు, సచివాలయ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి


కూరగాయలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి కృష్ణకిషోర్

పీలేరురూరల్ : హాస్టల్ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి కె. కృష్ణకిషోర్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో వంటగది, కిచెన్, మరుగుదొడ్లు, తాగునీటి సరఫరాను పరిశీలించారు. అన్ని వసతులు బాగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి. శివశంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నౌషాద్, పంచాయతీ కార్యదర్శి శివాజి, హాస్టల్ వార్డెన్ మునిస్వామి నాయక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ శ్రీధర్

పెద్దతిప్పసముద్రం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ శ్రీధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఓపీ, గర్భిణులు, బాలింతల సంఖ్య, సిబ్బంది పని తీరుపై ఆరా తీశారు. మందుల కొరత తదితర అంశాలపై కందుకూరు, పీటీఎం పీహెచ్‌సీ డాక్టర్లు ఎండీ యస్థాని, బీఎస్ సాదియా, శంకర్, అభిలాష్‌లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీహెచ్‌సీల సిబ్బందితో సమీక్షించారు. ప్రతి శుక్రవారం డ్రైడే తప్పకుండా చేపట్టాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీళ్ల నిలువ ఉండకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు దోమ తెరలు వాడాలని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ అందరి భాధ్యత అని పేర్కొన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. ల్యాబ్, మందుల స్టోర్, ప్రసవ గది, రికార్డులను పరిశీలించారు. ఈ సమావేశంలో ప్రభాకర్, ప్రవీణ్, శాంతి, రామక్రిష్ణ, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గుంతలదారికి మోక్షం ఎప్పుడు?


వర్షపు నీరు నిలిచిన చలిమామిడి హరిజనవాడ రోడ్డు

నిమ్మనపల్లె : మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ చలిమామిడి హరిజనవాడకు వెళ్లే రోడ్డు దుస్థితి చూసిన వారెవరైనా గుంతల రహదారికి మోక్షం ఎప్పుడంటూ ప్రభుత్వ వైఫల్యంపై బాహాటంగానే విమర్శిస్తున్నారు. దాదాపు 30 ఏళ్లకు పైగా స్థానికంగా ఉన్న 60 కుటుంబాల ప్రజలు ఈ దారిలో వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంటోంది. ఈ మార్గం గుండా దాదాపు వంద ఎకరాల్లో పంటలు పండించే రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. అంతేకాకుండా నిమ్మనపల్లె బాహుదా ప్రాజెక్టుకు ఇదే మార్గం గుండా వాహనాలు వెళతాయి. కొంతకాలంగా టిప్పర్ వాహనాల రాకపోకలు ఆగిపోయినా, గతంలో ఇసుక రవాణాకు అధికశాతం టిప్పర్లు వెళ్లడంతో రోడ్డు మరింత గుంతలు పడి దుస్థితికి చేరింది. వర్షం వస్తే గుంతల్లో నీరు నిలిచి రాకపోకలు సాగించే వాహనదారులు కిందపడి గాయాలపాలవుతున్నారు. స్థానికులు అనేకమార్లు సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చినా పరిష్కారంకు మాత్రం నోచుకోలేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డు సమస్య తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

రాజకీయంగా ఎదుర్కొలేకే మిథున్‌రెడ్డి అరెస్ట్


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మదనపల్లె: రాజంపేట పార్లమెంటు సభ్యులు పీవీ. మిథున్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కొనే శక్తి లేకనే మద్యం అక్రమ కేసులో కూటమి ప్రభుత్వం అరెస్ట్ చేసి వేధిస్తోందని బి.కొత్తకోట–అంగళ్లు మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ డీఆర్. ఉమాపతిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎంపీగా హ్యాట్రిక్ సాధించిన మిథున్‌రెడ్డి బలమైన నేతగా ఎదగడం, జిల్లా రాజకీయాల్లో టీడీపీ ఉనికి కోల్పోయే పరిస్థితి రావడం జీర్ణించుకోలేక అక్రమ కేసులతో వేధిస్తోందన్నారు. ఈ కేసుల్లో ఆధారాలు లేకున్నా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. అక్రమ కేసుతో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కూటమి నాయకులకు ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

పీలేరు : రాజకీయంగా ఎదుర్కొలేకనే రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిపై తప్పుడు కేసులు బనాయించి అరెస్ట్ చేశారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా మేధావుల విభాగంగా ప్రధాన కార్యదర్శి గుర్రం సురేంద్రనాథరెడ్డి అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ లిక్కర్ కేసులో ఎలాంటి సంబంధం లేకుండా ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేశారని ఆరోపించారు. అభివృద్ధి, సంక్షేమం గాలికొదలి అక్రమ అరెస్టులు పనిగా పెట్టుకుని ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. పెద్దిరెడ్డి కుటుంబంపై కక్షసాధింపు తీర్చుకోవడానికి ఇలాంటి తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. తామంతా పెద్దిరెడ్డి కుటుంబం వెంట ఉంటామని తెలిపారు. నాయకులు ఉదయ్‌కుమార్, సి.కె. వెంకటేశ్వర్లు, దాదావల్లి, రఫీ, సాయి తదితరులు పాల్గొన్నారు.